క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

సైదాపురం: మండలంలో పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ సూచించారు. ఆయన శుక్రవారం మండల అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెలుగు వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. అలాగే వెలుగు పథకం ద్వారా లబ్ధిదారులకు రూ.30 వేలు రుణాలను ఇస్తున్నామని, ఉపాధి హామీ పథకం ద్వారా 90 రోజుల పని దినాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. ఏవో భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునిమనోజ్ పాల్గొన్నారు.

వేణుంబాకంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

దొరవారిసత్రం : మండలంలోని వేణుంబాకం గ్రామంలో తిరుపతి స్విమ్స్, శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచితంగా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. పురుషులు, మహిళల్లో నోరు, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేశారు. 40 ఏళ్లు పైబడిన మహిళలు మూడేళ్లకొకసారి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ హరిత తెలిపారు. అదే విధంగా మద్యం, గుట్కా, సిగరేట్‌కు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చెంచమ్మకు ప్రత్యేక పూజలు

దక్కిలి: మండలంలోని వెలగొండలు కింద కొలువైన చెంచమ్మకు శుక్రవారం విశేష పూజలు చేశా రు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మినమనముడిలో 104 సేవలు

దొరవారిసత్రం : మినమనముడి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 104 సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొగరాముడి పీహెచ్‌సీ వైద్యాధికారి తరుణ్ సాయి చుట్టు పక్కల గ్రామాలను శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఇందులో ముఖ్యంగా దీర్ఘకాలిక రోగులైన బీపీ, షుగర్ తదితర వ్యాధులకు నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు.

సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం

సైదాపురం: బ్రాహ్మణీయ హిందుత్వ పాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి డిపిపోలయ్య పిలుపునిచ్చారు. సైదాపురంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం జ్యోతి రావు పూలే స్థాపించిన సత్యశోధక్ సమాజ్ 152 ఆవిర్భావ దినం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సత్యశోధక్ సమాజ్ 152 ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రాహ్మణీయ హిందూత్వ పాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 30 వరకు దేశ వ్యాప్తంగా కులనిర్మూలన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు చెంగల్ రావు, అంకయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

నది పోరంబోకు భూమిలో సాగుచేస్తే చర్యలు

నాయుడుపేట టౌన్ : మండలంలోని కూచివాడలో సర్వే నంబరు 140లో స్వర్ణముఖి నది పోరంబోకులో పంటలు సాగు చేస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దారు గీతావాణి హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు గత నెలలో నది పోరంబోకు భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను కొంతమంది తొలగించి పంటల సాగుకు ఉపక్రమించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ శుక్రవారం అక్కడికి చేరుకుని పరిశీలించారు. నదిలో ఆక్రమణలు చేపట్టిన 21 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. ఇంకా ఎవరైనా ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

చిల్లకూరు : గ్రామీణ ప్రాంతంలోని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తిరుపతి జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులు తెలిపారు. వారు శుక్రవారం ఓడూరులోని సబ్ సెంటర్, చిల్లకూరు పీహెచ్‌సీలో వైద్య సేవలను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. ఆపరేషన్ థియేటర్, వైద్యులు, రోగులకు చికిత్స అందించే గదులను పరిశీలించారు. కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ శ్రీనివాసులు, ఎస్‌వో నాగరాజు, డీపీవో ప్రకాష్, డీపీహెచ్‌ఎన్‌వో బేబీరాణి, వైద్యులు అరాఫత్ పాల్గొన్నారు.

పాస్టర్లకు సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లు పొందిన పాస్టర్లతో డైరెక్టర్ వినయ్‌కుమార్

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణం స్వర్ణముఖి నది సమీపంలో ఉన్న ఇంటర్ నేషనల్ బైబిల్ కాలేజీలో బైబిల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 20 మంది పాస్టర్లకు శుక్రవారం కాలేజీ డైరెక్టర్ ఎస్ఎం వినయ్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ మన దేశంతోపాటు వివిధ దేశాలకు చెందిన పాస్టర్లకు 4 నెలలు బైబిల్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తిరుపతి, నెల్లూరు తదితర జిల్లాలకు చెందిన పాస్టర్లు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎంపీడీవో కార్యాలయం

స్థానిక ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. చిన్నపాటి వర్షానికే ఉరుస్తోంది. కార్యాలయం అంతా తడిచి ముద్ద అవుతోంది. పైకప్పు పెచ్చులూడి పడిపోతోంది. గోడలు వర్షపు నీటితో నెమ్మెక్కుతున్నాయి. అన్ని గదుల గోడలూ నెర్రెలుబారాయి. ఎప్పుడు పడిపోతుందోనని సిబ్బంది భయంతో విధులు నిర్వహిస్తున్నారు.

– దక్కిలి


- అడుగు అడుగునా పగుళ్లు
- పెచ్చులూడుతున్న పైకప్పు
- ఆందోళన చెందుతున్న ఉద్యోగులు



దక్కిలి మండల పరిషత్ కార్యాలయ భవనం

దక్కిలి మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని 1987లో శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు పూర్తయి 1997లో ప్రారంభించారు. నాటి నుంచి దీనికి మరమ్మతులు చేయలేదు. దీంతో భవనం శిథిలావస్థకు చేరుకుంది. పలుచోట్ల గోడలు నెర్రెలు బారాయి. కిటికీలు సైతం చెదలుపట్టి దెబ్బతిన్నాయి. పైకప్పు పెచ్చులూడి పడుతోంది. భారీ వర్షాలు కురిస్తే గోడలు నెమ్మెక్కి నీరు కారుతుందని ఉద్యోగులు చెబుతున్నారు. మొత్తం తడిచిపోయి ముద్దముద్దగా అయితోంది. బయట హాల్‌లో కూడా టైల్స్‌పై నీరు చేరి కాలు పెడితే జారిపోయే పరిస్థితి నెలకొంటోంది. ఉద్యోగులు విధులు నిర్వహించాలంటే భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ వైర్లు, స్విచ్ బోర్డులు కూడా దెబ్బతిన్నాయి. విద్యుత్ తీగలు గోడలకు వేలాడుతున్నాయి. భవనం పైన చెట్ల ఆకులు, చెత్తాచెదారంతో నిండిపోయింది. వర్షపు నీరు నిలుస్తోంది. పిచ్చిమొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. మూడేళ్ల క్రితం కొత్త భవనం నిర్మించేందుకు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి శిలాఫలకం ఆవిష్కరించారు. తర్వాత పనులు మొదలుపెట్టలేదు. భవన నిర్మాణానికి మంజూరైన నిధులు రూ.1.40 లక్షలు వెనక్కి వెళ్లిపోయాయి. దీంతో ఏర్పాటు చేసిన శిలాఫలకం అటకెక్కింది. ప్రమాదం జరగకముందే శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని తొలగించి కొత్త భవనాన్ని నిర్మించాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం



మండల పరిషత్ కార్యాలయ భవనం దుస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం. అధికారుల ఆదేశాల మేరకు భవనానికి అవసరమైన మరమ్మతులు చేపడతాం.

– టి.ప్రసన్నకుమారి, ఎంపీడీవో, దక్కిలి



వర్షానికి ఉరుస్తున్న ఉద్యోగుల గది



రికార్డు గదిలో వచ్చిన పగుళ్లు





కార్యాలయంలో విద్యుత్ బోర్డులు, కిటికీల దుస్థితి



మిద్దెపై నిలిచిన వర్షపు నీరు

నేడు ప్రత్యేక పూజలు

వెంకటగిరి(సైదాపురం): తిరుమల లడ్డు ప్రసాదంపై సీఎం చంద్రబాబు నాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలోని వరదరాజస్వామి ఆలయంలో శనివారం ఉదయం 8.30 గంటలకు ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పెళ్లకూరు: తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డు తయారీలో కల్తీ జరిగినట్లు సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలకు నిరసనగా శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. వెంకటేశ్వరస్వామి లడ్డు విశిష్టతను దెబ్బతీయడం దారుణమన్నారు.


దుకాణాల ద్వారా రూ.2.67 లక్షల ఆదాయం

కోట: స్థానిక బజారువీధిలో ఉన్న పంచాయతీ దుకాణాలకు శుక్రవారం డీఎల్‌పీవో వెంకటరమణ వేలం పాటలు నిర్వహించారు. ఏడాదికి రూ.2.67 లక్షలకు మూడు దుకాణాలను వ్యాపారులకు కేటాయించినట్లు డీఎల్‌పీవో తెలిపారు. అదేవిధంగా పాత ఇనుము, కొయ్యలు వేలం ద్వారా మరో రూ.60 వేలు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో భవానీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు అండర్-15 క్రికెట్ పోటీలు ప్రారంభం

వెంకటగిరి రూరల్ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం వెంకటగిరిలోని తారకరామా క్రీడా ప్రాంగణంలో అండర్ -15 (బాలికలు) క్రీడా పోటీలు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో సౌత్ జోన్ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని వెల్లడించారు. మూడు రోజులు పోటీలు జరుగుతాయన్నారు.


కౌన్సిలర్‌కు పరామర్శ



తంబా సుకన్య కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ తంబా సుకన్య భర్త జగదీష్ ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం సుకన్య ఇంటి వద్దకు చేరుకున్నారు. ఆమెను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, కందాటి కళ్యాణి, సుబ్బారావు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పల్లె ప్రగతి




మాట్లాడుతున్న డీఎల్‌డీవో వాణిరెడ్డి

దక్కిలి: అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేస్తేనే గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతాయని గూడూరు డీఎల్‌డీవో వాణిరెడ్డి తెలిపారు. మన ఇళ్లు-మన గౌరవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం దక్కిలిలో గ్రామసభ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లోని ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అనంతరం ఆమె దక్కిలిలోని జగనన్న లేఅవుట్‌ను హౌసింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అదే విధంగా అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ప్రసన్నకుమారి, హౌసింగ్ డీఈ జహీరుద్దీన్, ఏఈ రాజా, ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

భవిష్యత్తు ప్రణాళికపై గ్రామసభలు

దొరవారిసత్రం : మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో భవిష్యత్తు ప్రణాళికపై అధికారులు శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. స్వచ్ఛత ఈసేవ, స్వర్ణాంధ్ర-2047, మన ఇళ్లు - మన గౌరవం కార్యక్రమాలపై గ్రామసభలు నిర్వహించి గ్రామాల్లో ఏఏ పనులు చేపట్టాలనే అంశాలపై ప్రత్యేక అధికారులు మాట్లాడారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, మన ఇళ్లు- మన గౌరవం కింద పక్కా గృహాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోన ఆలయ డీసీ బాధ్యతల స్వీకరణ




శ్రీనివాసులురెడ్డి

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన ఆలయ డిప్యూటీ కమిషనర్‌గా పి.శ్రీనివాసులురెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విశాఖపట్టణంలోని మహాలక్ష్మి ఆలయంలో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విద్యాసాగర్‌బాబు ప్రకాశం జిల్లా మాలకొండకు బదిలీ అయ్యారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ..

సైదాపురం: ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా మునిమనోజ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఇన్‌చార్జి ఏఈగా ఉన్న చరణ్ బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆయన ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌ను కలిశారు.

సబ్ రిజిస్ట్రార్..



అమర్‌కుమార్

రాపూరు: రాపూరు సబ్ రిజిస్ట్రార్‌గా అమర్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గుంటూరు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న జగన్ మోహన్ సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందించారు.

దేవుడి దర్శనానికి ఆంక్షలపై ఆగ్రహం

నాయుడుపేట టౌన్ : మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకునే విషయంపై ఆంక్షలు విధించడం తగదని వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు కటకం జయరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వివాదాలకు తావివ్వకుండా తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామిని కాలిన నడకన దర్శించుకునేందుకు వస్తుంటే కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్ని అడ్డుకునే చర్యలు చేపట్టడం శోచనీయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు బయటకు వెళ్లకుండా పోలీసులతో నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సబ బన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలును పక్కదోవ పట్టించేందుకే చంద్రబాబు తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వివాదాన్ని తెరపైకి తెచ్చారని విమర్శించారు. ఇప్పటికైనా మంచి బుద్ధి తెచ్చుకుని ఇలాంటి అనైతిక విధానాలను విడనాడాలని కూటమి నాయకులకు హితవుపలికారు

నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో శనివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు వైఎస్సార్ సీపీ నాయకుడు కటకం జయరామయ్య తెలిపారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

చిల్లకూరు : మండలంలోని వల్లిపేడులో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన డేగా రామయ్య(32) కుటుంబ సభ్యులకు శుక్రవారం నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద అయిన రామయ్య మృతితో ఆ కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రూ.12 వేలను గ్రామంలోని నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నందకుమార్, నాగరాజు, షఫీ, శివయ్య, శంకరయ్య, కస్తూరయ్య, పెంచలయ్య, సుబ్రమణ్యం, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 21.056 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 21.056 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9500 క్యూసెక్కుల నీరు చేరుతోందని తెలిపారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 1100, పిన్నేరు కాలువకు 40, హైలెవల్ కాలువకు 120, లోలెవల్ కాలువకు 10, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

నాయుడుపేట టౌన్ : బాధ్యతగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. మండలంలోని భీమవరంలో శుక్రవారం ఎంపీడీవో భువనేశ్వరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా స్వచ్ఛతాహి సేవాపై ప్రజలు, అధికారులు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ నెలవల అమృత సరళ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, ఎస్ చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ గోను బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు



రోడ్డు పక్కనే షాపింగ్ కాంప్లెక్స్ కోసం వేస్తున్న స్లాబ్

గూడూరు రూరల్ : మండలంలోని కొండగుంట గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం వెందోడుకు వెళ్లే రోడ్డు పక్కన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం స్లాబ్ వేసేందుకు ప్రయత్నించారు. స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వెందోడుకు వెళ్లే రోడ్డు పక్కన సర్వే నంబర్ 236-1ఏ, 1ఏ2లో సుమారు 20 సెంట్ల ప్రభుత్వ భూమిని స్థానికులు ఆక్రమించుకున్నారు. అందులో రేకుల షెడ్డు నిర్మించుకున్నారు. దీనిపై ఫిర్యాదులు అందినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రేకుల షెడ్డును తొలగించి పక్కా భవనం నిర్మించేందుకు అక్రమార్కులు శ్లాబ్ వేయడం ప్రారంభించారు. అలాగే పక్కనే ఉన్న పభుత్వ భూమిని ఆక్రమించి ఒక ప్రయివేటు కంపెనీకి చెందిన సెల్ టవర్ కోసం అద్దెకు ఇచ్చేశారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై వీఆర్వో రాధాక్రిష్ణను వివరణ కోరగా అక్రమ కట్టడం విషయంపై తహసీల్దార్ చంద్రశేఖర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నిర్మాణాన్ని అడ్డుకుని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారని తెలిపారు. దానిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యకర జీవనం

సైదాపురం: పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందని రాపూరు సీడీపీవో సునంద తెలిపారు. సైదాపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోషక విలువలున్న ఆహారంపై అవగాహన లేకపోవడం వల్లే పోషకాహార లోపం తలెత్తి రక్తహీనతకు దారితీస్తుందన్నారు. బాలింతలు, గర్భిణులు పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని కోరారు. గర్భిణులకు సీమంతం చేపట్టారు. సూపర్‌వైజర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ రికార్డుల పరిశీలన

చిల్లకూరు : ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రతి శుక్రవారం ఒక గ్రామంలో రోజ్‌గార్ దివస్ నిర్వహిస్తామని, దీని ద్వారా ఆయా గ్రామాల్లో ఉపాధి పనులకు వచ్చే వారి రికార్డులు పరిశీలిస్తామని ఏపీవో గిరిబాబు తెలిపారు. మండలంలోని పారిచెర్లవారిపాళెంలో శుక్రవారం రోజ్ గార్ దివస్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉపాధి కూలీల జాబ్ కార్డులు, క్షేత్ర సహాయకుల వద్ద ఉండే హాజరుపట్టీ, పని వివరాల రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో వర్షాకాలంలో చేపట్టబోయే పనుల వివరాలను కూలీలకు తెలియజేశారు. ఈకార్యక్రమంలో క్షేత్ర సహాయకులు శేషరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి ఫ్రీజర్ బాక్సు వితరణ



ఆస్పత్రికి ఫ్రీజర్ బాక్సు అందజేస్తున్న ఎమ్మెల్యే సోదరుడు సురేష్‌కుమార్

గూడూరు రూరల్ : ప్రమాదాల్లో మృతిచెందిన వారి మృతదేహాలను ఉంచేందుకు గూడూరు ఏరియా ఆస్పత్రిలోని ఫ్రీజర్ బాక్సులు పని చేయడం లేదు. దీంతో కొత్త వాటిని అందించేందుకు స్థానిక ఎమ్మెల్యే ముందుకు వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తండ్రి పెంచలయ్య జ్ఞాపకార్థం ఎమ్మెల్యే సోదరుడు సురేష్‌కుమార్ సొంత నిధులతో ఫ్రీజర్ బాక్సు అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా బేగం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా, సురేష్‌కుమార్, ప్రణీత్‌యాదవ్, వేముల సునీల్, మువ్వా చరణ్, దయాకర్, అరుణ్, శ్రీనివాసులు, వెంకటసాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా ఇది మంచి ప్రభుత్వం

తడ: మండలంలోని కాదలూరులో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆలస్యంగా నిర్వహించడంతో ప్రజలు, అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డా రు. మొదట సాయంత్రం 4 గంటలకు కార్యక్రమం జరుగుతుందని టీడీపీ నాయకులు ప్రచారం చేశారు. సాయంత్రం ఆరు గంటలైనా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రాలేదు. చివరకు ఆరున్నర గంటల సమయంలో ఆమె వచ్చారు. వేదిక మీదకు చిన్నా, చితకా నాయకులను పిలిచారే తప్ప అధికారులకు స్థానం కల్పించలేదు. వేదిక మీద ఏర్పాటు చేసిన బ్యానర్‌లో తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి ఫొటో లేదు. దీనిపై పలు విమర్శలు వెల్లువెత్తాయి. ఇది పార్టీ కార్యక్రమమా..? లేక ప్రభుత్వ కార్యక్రమమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమమైతే ఎంపీ ఫొటోలేకపోవడం ఏమిటని నిలదీస్తున్నారు.


మహిళల హక్కులపై అవగాహన అవసరం

గూడూరు రూరల్ : మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి షమ్మీ పర్వీన్ సుల్తానా తెలిపారు. గూడూరులోని డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో శుక్రవారం మహిళల భద్రతపై అవగాహన సదస్సు, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలకు పలు రక్షణా చట్టాలు ఉన్నాయని, వీటిని పూర్తిగా తెలుకోకపోవడం వల్లే ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో విక్రమ సింహపురి యూనివర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి విజయమ్మ, ప్రిన్సిపాల్ హనుమంతరావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

గూడూరు రూరల్ : గూడూరు రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ నాయకుడు నరసింహులు మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వసతులు కల్పించడంతోపాటు కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, సురేష్, బీవీ రమణయ్య, అడపాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గౌరీశంకర్ సేవలు అభినందనీయం



పారిశ్రామికవేత్త గౌరీశంకర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పెళ్లకూరు: ప్రముఖ పారిశ్రామికవేత్త, చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ చాగణం గౌరీశంకర్‌ను శుక్రవారం పెళ్లకూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సన్మానించారు. చాగణం గౌరీశంకర్ రూ.లక్షకు పైగా నిధులు వెచ్చించి పాఠశాల ప్రాంగణంలో మట్టి లెవలింగ్ పనులు చేయించారు. ఈ క్రమంలో ఆయనకు ఉపాధ్యాయులు, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో సీతారామయ్య, ఏవో కృష్ణ, హెచ్‌ఎం మునిశేఖర్, ఉపాధ్యాయులు మునికృష్ణయ్య, సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్ : ఈ నెల 21న ఆత్మహత్యకు యత్నించిన నాయుడుపేట పట్టణం పిచ్చిరెడ్డితోపు వీధికి జలదంకి కస్తూర్‌రెడ్డి (80) గురువారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పిచ్చిరెడ్డి తోపు వీధికి చెందిన కస్తూర్‌రెడ్డి, అతని భార్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ నెల 21న విషపు గుళికలు మింగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి నెల్లూరు తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతి చెందాడు. ఏఎస్‌ఐ ధర్మయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన యువకుడి మృతి

తడ: దాబాపై నిద్రిస్తూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఎస్‌ఐ కొండపనాయుడు కథనం మేరకు.. మండలంలోని రామాపురం హరిజనవాడకు చెందిన కె.అరుణ్‌కుమార్(22) శ్రీసిటీలోని ఒక పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఈ నెల 19వ తేదీన తన ఇంటి దాబాపై పడుకున్నాడు. ప్రమాదవశాత్తు కింద పడి అపస్మారక స్థితిలో చేరుకున్నాడు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు 20వ తేదీ ఉదయం గమనించారు. వెంటనే శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నై రాయపేటలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ శుక్రవారం అరుణ్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు చెన్నై వెళ్లి మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యు లకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.